క్లుప్తంగా

దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్ల: జిల్లాలో బెస్ట్ అవైలేబుల్ స్కూల్ (రెసిడెన్షియల్, నాన్–రెసిడెన్షియల్) పథకంలో ఎంపికకు ప్రైవేట్ స్కూల్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీడీవో బి.రాజమనోహర్ రావు శనివారం కోరారు. 2025– 2026 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలేబుల్ స్కూల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతికి ప్రతి విద్యార్థికి రూ.42,000 చొప్పున, బెస్ట్ అవైలేబుల్ స్కూల్ (నాన్–రెసిడెన్షియల్) పథకంలోని విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రూ.28,000 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. 7వ తరగతి, 10 వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత అందులో 50 శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. దరఖాస్తులను జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో మే 22లోగా అందించాలని ఆయన కోరారు. జిల్లాలోని ప్రైవేట్, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని రాజ మనోహర్‌రావు కోరారు

ప్రతీగింజను కొనుగోలు చేయాలి

సిరిసిల్లటౌన్: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని కార్మికభవన్‌లో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కొనుగోళ్లలో జాప్యంతో ఇప్పటికే రైతులు దళారులకు లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని విక్రయించారన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే కొనాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..

ఎల్లారెడ్డిపేట: మండలంలో డేంజర్ స్పాట్‌లుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకట రామయ్య శనివారం తెలిపారు. 'సాక్షి'లో 'డేంజర్ స్పాట్స్' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలో సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారి గుండా ప్రమాదాలు జరుగుతున్నా మూలమలుపుల వద్ద ముందుగా రక్షణ చర్యలు చేపడుతామన్నారు.

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్ శివారులో సైడ్ వాల్స్ లేక ప్రమాదాలు జరుగుతుండగా, రోడ్డు కిరువైపులా మట్టిని పోసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'సాక్షి'లో శనివారం ' సైడ్ వాల్స్ లేక ప్రమాదాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

నియామక పత్రం అందజేత



ముస్తాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొండాపూర్‌కు చెందిన చిగురు వెంకన్నను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. వెంకన్న మాట్లాడుతూ బీసీల ఐక్యత, హక్కుల కోసం ఉద్యమిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీల గణనతోపాటు జాతీయ స్థాయిలో గణన చేపట్టాలన్నారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం ఎదురుగట్ల వద్ద ఓ ఆటో ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. నేరెళ్ల శేఖర్ నూకలమర్రి నుంచి వేములవాడకు బైక్ పై వస్తుండగా, పోతు పవన్ వేములవాడ నుంచి నూకలమర్రికి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగట్ల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రెండు వాహనాలను పాల ఆటో ఢీకొట్టింది. క్షతగాత్రులను 108లో వేములవాడలోని ఏరి యా ఆసుపత్రికి తరలించారు. శేఖర్ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ మారుతి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు

ఎల్లారెడ్డిపేట: బాల్య వివాహాలు చేసే తల్లితండ్రులు, బంధువులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో ఉమారాణి హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్‌లో శుక్రవారం ఓ బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకోగా.. శనివారం సీడీపీవో విలేకరులతో మాట్లాడారు. చట్టాల గురించి తెలియక కొందరు ఇప్పటికీ బాల్య వివాహాలు చేస్తున్నారన్నారు.చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడంతో అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు.

భూమిపూజ

బోయినపల్లి: రామన్నపేటలో తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్లు వారంరోజుల క్రితం రామన్నపేట గ్రామస్తులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను తన నివాసంలో కలిసి సమస్య వివరించారు. స్పందించిన ఆయన తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేయిస్తానని మాట ఇచ్చారు. శనివారం బోరు బావి నిర్మాణ పనులను ప్రారంభించారు.

అదునులోగా అందేనా..

- పచ్చిరొట్ట కోసం రైతుల ఎదురుచూపులు
- జిల్లాలో 5 వేల క్వింటాళ్లు అవసరం
- గతం కంటే వెయ్యి క్వింటాళ్లు తగ్గింపు
- 2 వేల క్వింటాళ్లు అలాట్‌మెంట్
- ఈసారి ఐకేపీల ఆధ్వర్యంలో పంపిణీ
- ఇంకా జిల్లాకు చేరని విత్తనాలు



ఇతను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు బందారపు బాల్‌రెడ్డి. ఇతనికి 3 ఎకరాల వరి సాగుచేసే భూమి ఉంది. ఏటా సొసైటీల ద్వారా జీలుగు విత్తనాలు పంపిణీ చేయడంతో వరి కోతలు పూర్తికాగానే 3 బ్యాగులు తీసుకొని భూమిలో చల్లుకునేవారు. అయితే ప్రతీ సారి ఏప్రిల్ నెలాఖరులో విత్తనాలు చల్లుకొని జూన్ నెలాఖరు వరకు భూమిలోనే దున్నేసేవారు. ఇలా చేయడం ద్వారా భూమికి పోషకాలు అంది రసాయన ఎరువుల వినియోగం తగ్గేది. ఈ సారి మే నెలా మూడో వారం వచ్చినా విత్తనాలు అందలేదు. దీంతో తన భూమిని అలాగే వదిలేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రైతులందరి పరిస్థితి ఇదే.



విత్తనాలు అందక భూమిని ఖాళీగా వదిలేసిన రైతులు

ఎల్లారెడ్డిపేట/చందుర్తి: భూమికి సహజ సిద్ధంగా పోషకాలు అందించే పచ్చిరొట్ట(జీలుగ) విత్తనాలు ఇంకా జిల్లాకు చేరలేదు. వరికోతలు పూర్తయి నెలరోజులు గడుస్తున్నా జీలుగ విత్తనాలు లేక రైతులు తమ పొలాలోను చదును చేయకుండా అలాగే వదిలేశారు. గతంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ చేయగా.. ఈ సీజన్ నుంచి ఐకేపీల ఆధ్వర్యంలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. వానా కాలం పంట సాగుకు కాలం సమీపిస్తున్నా జీలుగు, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు ఇప్పటి వరకు రాలేదు. జీలుగు విత్తనాలు వేసిన 40 రోజుల వరకు ఏపుగా ఎదిగిన మొక్కలను కలియ దున్నాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి. విత్తనాలు చల్లడానికి ఇదే సరైన సమయమని రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం విత్తనాలు తెప్పించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు అలాట్‌మెంట్ ఇలా..

సంవత్సరం	జీలుగు వచ్చినవి	విక్రయించినవి
2024	3వేల క్వింటాళ్లు	1,880 క్వింటాళ్లు
2025	2వేల క్వింటాళ్ల అలాట్	–
సంవత్సరం	జనుము వచ్చినవి	విక్రయించినవి
2024	4వేల క్వింటాళ్లు	4వేల క్వింటాళ్లు
2025	–	–

2 వేల కింటాళ్ల అలాట్‌మెంట్

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల వ్యాప్తంగా 5వేల క్వింటాళ్ల వరకు జీలుగ విత్తనాల డిమాండ్ ఉంది. ప్రస్తుతం 2వేల క్వింటాళ్లకేటాయింపు జరిగింది. అలాట్ చేసిన విత్తనాలు కూడా ఇప్పటి వరకు జిల్లాకు చేరలేదు. గతంలో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో పంపిణీ చేయగా..ఈసారి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఐకేపీల ఆధ్వర్యంలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలోని 13 మండలాల వ్యాప్తంగా 15 మహిళా సంఘాలకు లైసెన్స్‌లు ఇచ్చారు. వీరి ద్వారానే జీలుగు విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని మహిళా సంఘాల సభ్యులను ఇందులో భాగస్వాములను చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గతేడాది 7వేల క్వింటాళ్ల విత్తనాలు

గత వానాకాలం సీజన్‌లో 3 వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు, 4వేల క్వింటాళ్ల జనుము విత్తనాలను సరఫరా చేశారు. కానీ ఈసారి జిల్లాకు 2వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు మాత్రమే మంజూరు వచ్చింది. కానీ ఇప్పటి వరకు ఆ విత్తనాలు కూడా జిల్లాకు చేరుకోలేదు. గతేడాది జీలుగు విత్తనాలు పూర్తిస్థాయి విక్రయించలేదనే, ఈసారి 2వేల క్వింటాళ్లు అలాట్ చేశారా.. అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. 4వేల క్వింటాళ్ల జనుము విత్తనాలు ఈసారి జిల్లా అలాట్ చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటన్న అనుమానాలు కలుగుతున్నాయి. గతంలో కంటే ఈసారి వరిసాగు 12వేల ఎకరాల్లో ఎక్కువగా సాగవుతుందని అధికారులు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కానీ పచ్చిరొట్ట విత్తనాల అలాట్‌మెంట్ తగ్గడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

రసాయనిక ఎరువులకు బదులుగా..

రసాయనిక ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో భూసారం దెబ్బ తిని పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. దీంతో రైతులు దివాళా తీస్తున్నారు. పశుపోషణ భారంగా మారడంతో పశువుల సంఖ్య కూడా తగ్గిపోయింది. సేంద్రియ ఎరువుగా వినియోగించే పశువుల పేడ లభించడం లేదు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు పచ్చిరొట్ట సాగుపై రైతులు దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై జీలుగు, జనుము, పిల్లిపెసర సాగును పెంచేందుకు అధికారులు ప్రచారం చేస్తున్నారు. రసాయనిక ఎరువుల వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ఎకరానికి కావాల్సిన కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తుంది.

ఏటా జీలుగు సాగుచేస్తున్నా



గ్రామాల్లో పశువుల ఎరువును కొనుగోలు చేస్తామంటే ఎక్కడ దొరకడం లేదు. దొరికిన చోట ట్రాక్టర్ పశువుల పేడకు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు డిమాండ్ ఉంది గత నాలుగేళ్లుగా జీలుగు సాగుచేస్తున్నా.40 రోజులపాటు పెంచుకొని పొలంలో దమ్ము చేస్తున్నా. ఎరువుల బస్తాల వాడకం తగ్గి, పంట దిగుబడి పెరుగుతుందన్న ఆశతో పచ్చిరొట్ట సాగుచేస్తున్నాం.

– గడ్డం మల్లారెడ్డి, రైతు, బండపల్లి

విత్తనాల అలాట్‌మెంట్ జరిగింది



జిల్లాకు పచ్చిరొట్ట విత్తనాల అలాట్‌మెంట్ జరిగింది. ఇంకా జిల్లాకు విత్తనాలు చేరుకోలేదు. హర్యానా రాష్ట్రం నుంచి విత్తనాలు రావాల్సి ఉంది. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. విత్తనాలు రాగానే ఐకేపీ మహిళా సంఘాల సభ్యులచే రైతులకు పంపిణీ చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

– అఫ్జల్‌బేగం, జిల్లా వ్యవసాయాధికారి

నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: నేతకార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కోరారు. "పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మూషం రమేశ్, కోడం రమణ, సిరిమల్ల సత్యం శనివారం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్వీరావు, టెస్కో జీఎం అశోక్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ మహిళాశక్తి చీరల వస్త్రానికి ఒక మీటర్‌కు రూ.5.25 కూలి నిర్ణయించాలని కోరారు. మహిళాశక్తి చీరలపై పది శాతం యారన్ సబ్సిడీ అందించాలని కోరారు. చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ నుంచి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

పంట మార్పిడితో అధిక దిగుబడులు

ముస్తాబాద్: పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధిస్తారని జిల్లా ఉద్యానవన అధికారి లత పేర్కొన్నారు. చీకోడు రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, రైతులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రియదర్శిని, వెంకట్రాజం మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడొద్దని, కొయ్యకాళ్లను పొలంలోనే కాల్చవద్దని సూచించారు. పంట కోసిన అనంతరం ఎకరానికి మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్పెట్ వేసుకోవాలని తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, లీడ్ బ్యాంక్ కౌన్సిలర్ రమణ, డైరెక్టర్లు కొండల్‌రెడ్డి, రామచంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లత

31వరకు తుది గడువు

సిరిసిల్లకల్చరల్: గత విద్యా సంవత్సరానికి సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 31ని తుది గడువుగా ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి బి. రాజమోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధాన్యం డబ్బులు లెక్కలు చూపాలి

ముస్తాబాద్: రైతుల నుంచి ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు.. ఎంతమంది రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించారో అధికారులు లెక్కలు చెప్పాలని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రబీలో ధాన్యం సేకరణను ప్రభుత్వం ఆలస్యంగా ప్రారంభించిందన్నారు. అప్పటికే అరవైశాతం ధాన్యాన్ని వ్యాపారులు, దళారులు కొనుగోలు చేశారన్నారు. అయిన కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి రైతులకు ఇప్పటి వరకు తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. యూత్ విభాగం మండల అధ్యక్షుడు శీలం స్వామి, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, శేఖర్, చారి తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికులకు ఉపాధి పనులు

సాక్షి స్పందన

సిరిసిల్లటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న భవన నిర్మాణ కార్మికుల్లో జాబ్‌కార్డు ఉన్న వారికి ఉపాధిహామీ పనులు కల్పి స్తామని డీఆర్‌డీవో శేషాద్రి శనివారం ప్రకటనలో తెలిపారు. భవన కార్మికుల కష్టాలను వివరిస్తూ 'సాక్షి'లో శనివారం 'సార్.. పని ఇవ్వండి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. సిరిసిల్ల లేబర్ అడ్డాపై మౌలిక వసతుల కల్పనకు ఫెసిలిటేషియన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీఎల్ అఫ్జల్ నజీర్ తెలిపారు. ఈమేరకు ప్రతిపాదనలు కలెక్టర్ ద్వారా పంపించినట్లు వివరించారు. కార్మికుల వివరాలను త్వరలోనే భవన నిర్మాణ సంక్షేమ ట్రస్టులో రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. లేబర్ అడ్డాలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'భగీరథ' నీరు వృథా..



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్పూర్ శివారులో ఉన్న రైస్‌మిల్లు వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయ్యింది. దీంతో ప్రజలకు ఇంటింటికి సరఫరా కావాల్సిన తాగునీరు నీరు రోడ్లవెంట వృథాగా పోయాయి. మండలకేంద్రంతో పాటు అల్మాస్‌పూర్‌లో ఆరు రోజుల వ్యవధిలో మూడుసార్లు మిషన్ భగీరథ పైపులైన్‌లు లీకేజీ అయింది. అధికారుల నిర్లక్ష్యంతోనే పైపులైన్లు లీకేజీ అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేసి లీకేజీ అవుతున్న పైపులైన్లను మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ శ్రీ శివ సాయి మందిరం వార్షికోత్సవాన్ని శని వారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో పుణ్యహవచనం, నవగ్రహ పూజ, హ వనం, పూర్ణాహుతి, పూజలు చేశారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి సాయిబాబా విగ్రహానికి అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

వీర్నపల్లి: రేకుల షెడ్డుకోసం వేసిన ప్రహరీని అధికారులు కూల్చివేశారని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మండలంలోని బాబాయ్ చెరువు గ్రామానికి చెందిన బానోత్ సంతోష్ పోడుభూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇల్లు లేకపోవడంతో రోడ్డు పక్కన చిన్న రేకుల షెడ్డు వేసుకుంటుండగా బీట్ ఆఫీసర్ కిరణ్ కుమార్ శనివారం పనులు ఆపి ప్రహరీని కూల్చివేశారని సంతోష్ భార్య వాపోయింది. గిరిజనులు, అధికారులకు మధ్య వాగ్వాదం జరగగా మనస్తాపంతో సంతోష్ పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ కిరణ్‌ను వివరణ కోరగా అడవి భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పినా నిర్మాణం చేపట్టడంతో అడ్డుకున్నట్లు తెలిపారు. ఎస్సై ఎల్లాగౌడ్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల గ్రామ పంచాయతీ పరిధి పాత చెరువు కట్టను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల పలువురు చెరువు కట్టను ధ్వంసం చేస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా రు. దీంతో తహసీల్దార్ ముక్తార్ పాషా శనివారం చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. పాత చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీఎం నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఇక్కడ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడగాని వెంకటేశ్, వేములవాడ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగం మురళి, లావుడ్య శేఖర్, ధర్మపురి శ్రీనివాస్, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షుడు రోమాల ప్రవీణ్, సోషల్ మీడియా వారియర్ వినయ్ గౌడ్ తదితరులున్నారు.



కోనరావుపేట: మండలంలోని కనగర్తి ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంపై బల్బు వెలగడం లేదు. నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు స్పందించడం లేదు. రాత్రయితే చాలు ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంది. వెంటనే కొత్త బల్బు ఏర్పాటు చేయాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కవిత రెడ్డి గ్రామ కార్యదర్శి, 8688709971

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలి



చందుర్తి : మాట్లాడుతున్న రేగుల మల్లికార్జున్



ఇల్లంతకుంటలో..

చందుర్తి: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 22న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో చేపట్టే హిందూ ఏక్తా యాత్రను హిందువులు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ కోరారు. శనివారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్ ఆధ్వర్యంలో చేపట్టి హిందూ ఏక్తాయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో యువకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, పోంచెట్టి రాకేశ్, చిర్రం తిరుపతి, హనుమయ్య చారి, షిర్డి మల్లేశం, పత్తిపాక శ్రీని వాస్, చింతకుంట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: హిందువులపై జరుగుతున్న దాడులను తిప్పి కొట్టాలని మండల హిందూ ఏక్తాయాత్ర ఇన్‌చార్జి గుజ్జ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన హిందూ ఏక్తా సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 22న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించే హిందూ ఏక్తాయాత్ర కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్, మామిడి హరీశ్, నాగసముద్రాల సంతోష్, కొలనూరి ముత్తవ్వ, శ్రావణ్ కుమార్, గుంటి మహేశ్, వజ్జేపల్లి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి

సిరిసిల్ల: రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రజిత సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం 'ప్రపంచ రక్తపోటు దినోత్సవం' సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. రజిత మాట్లాడుతూ సాధారణ సమస్యగా అధిక రక్తపోటు మారిందన్నారు. 'మీ రక్తపోటును కచ్చితంగా కొలువండి, దానిని నియంత్రించండి ఎక్కువ కాలం జీవించండి' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ అతుల్, వైద్యులు సంపత్‌కుమార్, అంజలి ఆల్ఫ్రెడ్, అనిత, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, లింగం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కోనరావుపేట: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ట్రెయినీ ఎస్సై రాహుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివార ం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కెంద గంగాధర్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ సర్పంచులు కదిరె శ్రీనివాస్, అనుపాటి బాపురెడ్డి, నిషాని రవీందర్, గుగులోత్ జగన్‌నాయక్, నాయకులు మేర్గు లక్ష్మణ్, ఆరె మహేందర్, బొజ్జం మల్లేశం, టోర్నమెంట్ నిర్వాహకులు తీగల వెంకన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రెయినీ ఎస్సై రాహుల్‌రెడ్డి

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



కోనరావుపేట: సుద్దాలలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం



తంగళ్లపల్లి: అంకిరెడ్డిపల్లెలో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి/కోనరావుపేట/వీర్నపల్లి: అకాలవర్షాలతో కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి తూకం వేసిన బస్తాలు తడిసిపోయా యి. వీర్నపల్లి మండలం వన్‌పల్లిలోని కేంద్రంలో ధాన్యం మొలకెత్తింది. కోతులు కూడా ధా న్యం కుప్పలపై అడవిపందులు దాడి చేయడంతో దాదాపు 4 క్వింటాళ్ల ధాన్యం రైతులు నష్టపోయారు. కోనరావుపేట మండలం సుద్దాల, మంగళ్లపల్లి, నిజామాబాద్, వెంకట్రావుపేట, కోనరావుపేట కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

తడిసిన ధాన్యం పరిశీలన

తంగళ్లపల్లి: రైతులు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని, అధైర్యపడొద్దని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని అంకిరెడ్డిపల్లె, రామన్నపల్లె తోపాలు పలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి, సత్తు శ్రీనివాస్ రెడ్డి, మందాటి తిరుపతి యాదవ్, రైతులు పాల్గొన్నారు.

చెట్లనరికివేతపై ఫిర్యాదు

ఇల్లంతకుంట: వల్లంపట్ల తాళ్లకుంట కట్టపై వేపచెట్లను నరికి వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎస్సై శ్రీకాంత్ గౌడ్‌కు, జిల్లా అటవీ అధికారులకు, అదే గ్రామానికి చెందిన కేతిరెడ్డి వెంకట నరసింహారెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అటవీ అధికారులు వచ్చి పరిశీలించారు.